**కథ** -డి. వాణీప్రభ

# సేవ్ మై మదర్‌లాండ్!

**2050 మార్చి 20 రాత్రి 10 గంటల 20 నిముషాల 35 సెకన్లు.**

**'మూన్ టు ఎర్త్' రోజూ రెండుసార్లు ప్రయాణించే సోలార్ ఆపరేటెడ్ స్పేస్ క్రాఫ్ట్ హైదరాబాద్ ఈస్ట్‌సిటీలో నిర్మించిన స్పేసోడ్రోమ్‌లో లాండ్ అయింది.**

**పాసింజర్స్ అందరూ స్పేస్ సూట్‌లూ, ఆక్సిజన్ మాస్కులూ ఊడదీసుకుంటూ దానితోపాటే స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామన్న ఆశతో క్రిందికి దిగడానికి రెడీ అయ్యారు.**

మూడో వరుసలో రెండో సీట్లో కూర్చున్న చంద్రబాబు లేచి తన లగేజ్ తీసుకుని మొదటిసారిగా భూమిమీద అడుగుపెట్టబోతున్నందుకు ఒకింత ఆనందంతో కూడిన ఎగ్జయిట్‌మెంట్‌తో పులకరించిపోయాడు. 22 సంవత్సరాల చంద్రబాబు పేరుకి తగ్గట్టు తెల్లటి రంగు, స్ఫురద్రూపం, చందమామలా సాత్వికమైన రూపం- భూమి మీదున్న అమ్మమ్మనీ, తాతయ్యనీ చూసి, వెడ్డింగ్‌కి ఆహ్వానించడానికి వచ్చాడతను.

20వ శతాబ్దం వచ్చి 15 సంవత్సరాలు గడిచాక భూగోళం మీద కొన్ని తీవ్రమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. విపరీతమైన జనాభా పెరుగుదల వలన శాస్త్రజ్ఞులకి ఆ జనాభాకి నిలబడే చోటు చూపించవలసిన అవసరం ఏర్పడింది. నాసా చేసిన ప్రయోగాలు ఫలించి చంద్రుడి మీదకి జనాన్ని తరలించే అవకాశం కలిగింది. అక్కడ కూడా రకరకాల వ్యాపారాలు, హోటళ్లు, స్కూళ్లు, షాపింగ్ మాల్స్, కాలనీలు, ఆఫీసులు అన్నీ వెలిశాయి. చంద్రుడి మీద కూడా మనిషి గ్రావిటీ తగ్గిపోకుండా నిలబడి ఉండేందుకు జీన్స్‌లోనే క్రోమోజోమ్స్ సంఖ్య మార్చే దిశలో జరిగిన ప్రయత్నాలు సత్ఫలితాలనిచ్చాయి. ఉన్న అడ్డంకులు అన్నీ తొలగిపోవడంతో చంద్రుడి మీదకి వెళ్లడం అమెరికా వెళ్లినంత సులువైంది. చాలామంది అక్కడే స్థిరపడి అప్పుడప్పుడూ మదర్ ప్లానెట్‌కి వచ్చిపోతూ ఉంటారు. అలా చంద్రుడి మీదకి వలస వెళ్లి స్థిరపడిన వాళ్లలో చంద్రబాబు అమ్మానాన్నల ఫామిలీ ఒకటి. వాళ్ల అమ్మమ్మ చిన్నప్పుడు ఆవిడకి ఇష్టమైన రాజకీయ నాయకుడి పేరు చంద్రబాబట- ఆ పేరే మనవడికి పెట్టిందట ఆవిడ. రాజశేఖర రెడ్డి పేరు పెట్టాలని తాతగారూ, అద్వానీ పేరు పెట్టాలని పెదతాతగారూ పోటీపడ్డారట కానీ సహజంగానే చివరికి అమ్మమ్మ గెలిచింది అని వాళ్లమ్మ చెప్తూ ఉంటుంది. ఇంట్లో తరచుగా భూమిని గురించి వీడియో కేసెట్లు వేసుకుంటూ ఉండడం, తెలుగు వాళ్లంతా పండగలు సెలబ్రేట్ చేసుకోవడం, స్పేస్‌నెట్‌లో ఇక్కడి విశేషాలు చూస్తూ ఉండడంతో పెద్ద క్రొత్తదనమేం ఫీలవ్వలేదు చంద్రబాబు.

కాకపోతే విపరీతమైన జనాభాతో నిండిపోయి ట్రాఫిక్ జామ్‌తో ఇంటికెళ్లడానికి గంట పడుతుందనుకున్న అతను నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు చూసి ఆశ్చర్యపడ్డాడు. జనాభా పెరగడంతో ఎంత ఉత్పత్తి చేసినా ఎప్పుడూ కొరతగానే ఉండడంతో ఫ్యాక్టరీలు, రైతులు, ఎన్ని బ్రాంచీలు తెరిచినా ఎంత హుషారుగా పని చేసినా ఇంకా వస్తూనే ఉన్న ఖాతాదారులతో విసిగిపోయిన బాంకులు, ఎంతమంది పిల్లలని చేర్చుకున్నా, ఎంతమంది టీచర్లని పెట్టినా ఇంకా సగంమంది నిరక్షరాస్యులుగానే మిగిలిపోవడంతో స్కూళ్లు...ఇలా ప్రతీదీ షిఫ్ట్ సిస్టంలోనే పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఒక వారం డే షిఫ్ట్, ఒక వారం నైట్ షిఫ్ట్ పనిచేస్తారు అందరూ. ఇంట్లో కూడా అందరూ ఒకేసారి పడుకునే అవకాశం లేకపోవడంతో కొంతమంది డేషిఫ్ట్ కొంతమంది నైట్‌షిఫ్ట్‌లకీ వెళ్లి వస్తారు.

ఎక్కడ చూసినా సోలార్ ఎనర్జీతో పనిచేసే పరికరాలే! ప్రతి ఇంటి మీదా సోలార్ సెల్స్-ఛార్జర్, జల విద్యుత్ అనేది వాళ్లకి పురాణకాలం నాటి మాట. చాలా ఏళ్లక్రితమే కాంగ్రెస్ పరిపాలనలోనే ఈ విద్యుత్ అనే పదం అంతమైపోయిందట- జనం మోటార్లు, గీజర్లు అన్నీ మర్చిపోయి చిన్న బాల్చీ, కొబ్బరి తాడుతో నీళ్లు తోడుట, కొబ్బరాకులు మంట పెట్టి నీళ్లు కాచుట వంటి ప్రయోగాలు చేస్తూ ఉండేవారట. గూట్లో దీపం నోట్లో మెతుకు సామెతని నిజం చేస్తూ చీకటి పడేసరికి భోజనాలు పూర్తిచేసుకుని దొడ్లో మంచాలేసుకుని కబుర్లు చెప్పుకునే వారట- ఈ విధంగా ప్రజల మధ్య అనురాగం, బంధాలు సామాజిక, సాంస్కృతిక సంబంధాలని మెరుగు పరచగలిగామని ఆ ప్రభుత్వం గొప్పలు చెప్పుకునేదట. తర్వాత్తర్వాత పెద్ద పెద్ద పరిశ్రమలకీ, హోటళ్లకీ కొన్ని రక్షణశాఖ కార్యాలయాలకి మాత్రమే పరిమితమైంది విద్యుత్తు. సామాన్య వినియోగదారులు మాత్రం కర్మసాక్షి సాక్షిగా కరంటంటే ఏమిటో మర్చిపోయారు.

ఇండియాలో అమ్మమ్మ చిన్నప్పుడు క్రికెట్ కూడా ఆడేవారట- ఎక్కడికెళ్లినా ఓడిపోయి వచ్చే ఆ టీంని, టీం 'స్పిరిట్'ని అయినా వాళ్లకి ప్రతిఫలంగా లభించే కోట్లాది రూపాయలని గురించి సామాన్య జనం విచిత్రంగా చెప్పుకునేవారట.

ఇవన్నీ గుర్తు తెచ్చుకుంటున్న చంద్రబాబుకి సెకండ్ షిఫ్ట్‌లో మనుషులెందుకు లేరో మాత్రం అర్థమవ్వలేదు. టాక్సీ డోర్ తీసి భాగ్యనగరం అందాలని తొలిసారి తిలకించాలని సరదాపడ్డాడు కానీ కిటికీ తలుపుతీస్తున్న చంద్రబాబుని డ్రైవర్ 'ఏంటి ఈ ఊరికి క్రొత్తా?' అని నిలేయడంతో ఇక్కడ కిటికీ తీస్తే ఫైన్ కాబోలు అనుకున్నాడు.

ఇంటి ముందు టాక్సీ దిగి అమ్మమ్మ తాతయ్యల ఇంటిని ఒక్కక్షణం ఉద్వేగంగా కలయజూశాడు. ఇరవై గజాల స్థలంలో అయిదారు అంతస్థులుగా కట్టిన ఇల్లు అది. ముందు మూడు గజాల స్థలంలో చిన్న గార్డెన్- పై అంతస్థు మీద సోలార్ ప్లేట్- చూడడానికి ముచ్చటగానే ఉన్నా అక్కడ అవన్నీ కంపల్సరీ కూడా అని చంద్రబాబుకి తెలుసు. ప్రతీ ఇంటి ముందు మూడు ఇంటూ మూడు తొమ్మిది గజాలలో పచ్చగా పెరిగి కాలుష్యాన్ని సంగ్రహించే మొక్కలుండాలి. ఇంటిపైన సోలార్ ఎనర్జీ ప్లేట్ కూడా తప్పనిసరి. ఒక్కొక్క చిన్న కుటుంబానికి 20 గజాలు చొప్పున, అవిభక్త కుటుంబాలకి 50 గజాల

చొప్పున ప్రభుత్వమే స్థలాలు కేటాయించింది. ఈ రూల్స్‌లో ఎలాంటి పరిమితులూ ఉండవు. ఒక కాలనీ మొత్తానికి ఒకే చోట అయిదారు అంతస్థులుగా నిర్మించిన కార్ పార్కింగ్, స్కూటర్ పార్కింగ్, జిమ్, లైబ్రరీ, పార్క్, వాటర్ టాంక్, టాయ్‌లెట్స్ అన్నీ ఉంటాయి. అంతేకానీ ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ల పార్క్ చేయడానికి వీల్లేదు. కొన్ని వీధులవాళ్లు ఒక దారిలోనూ, మరికొన్ని వీధుల వాళ్లు దానికి అపసవ్య దిశలోనూ నడవాలి. లేకపోతే అంత పెద్ద 4 లైన్ల రోడ్లూ త్రొక్కిసలాటలతో నిండిపోతాయి. ప్రతి ఇంటికీ షాపింగ్ టైం కార్డ్ అని ఒకటి పంచుతారు. ఆ పర్మిటెడ్ టైంలో మాత్రమే షాపింగ్‌కి వెళ్లాలి. బజార్లు, కూరగాయల స్టాల్స్ వద్ద నిరంతరం 144 సెక్షన్ అమలులో ఉంటుంది. వినియోగదారులు ఖచ్చితంగా క్యూ పాటించాలి. అయిదు లేదా ఆరుగురు గుంపులుగా చేరకూడదు. గట్టిగా మాట్లాడకూడదు. అమ్మమ్మ చిన్నప్పటిలా పదిమంది ఫ్రెండ్స్‌ని వెంటేసుకుని రోడ్లమీద తిరుగుతూ షాపింగ్ చేస్తే పట్టుకుని జైల్లో వేస్తారు. దేశ జనాభా అప్పటికే 165 కోట్లకి మించిపోవడంతో ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రాథమిక హక్కులైన సభలు, సమావేశపు హక్కులని ప్రభుత్వం అత్యవసర పరిస్థితి చట్టం క్రింద రద్దు చేసి పారేసింది. ఇన్ని చర్యలు తీసుకోకపోతే వచ్చే నష్టాలని కళ్లారా చూడడంతో జనం నోరెత్తడం లేదు.

అమ్మ మాటలు గుర్తుచేసుకుని, భూ మండలం జనాభా విస్ఫోటనంతో వెల్లువెత్తిపోయి అల్లకల్లోలంగా ఉంటుందని, తనకి అమ్మమ్మ ఇంట్లో · ఘన స్వాగతం లభిస్తుందనీ ఊహించిన చంద్రబాబు నిర్మానుష్యంగా ఉన్న రోడ్లనీ, నిశ్శబ్దంగా మూసి ఉన్న తలుపులనీ అయోమయంగా ఛూసాడు. నిరాసక్తంగా బెల్ నొక్కాడు.

రెండు నిముషాలకి టక్కున తలుపు తెరుచుకుని ఒక బలమైన చెయ్యి బలంగా చంద్రబాబుని లోపలికి లాగి తలుపేసేసింది. అనుకోని ఈ సంఘటనకి గుండె ఆగినంత పనయ్యి కెవ్వున అరిచాడు చంద్రబాబు.

''కంగారు పడకురా...మేమే'' అంటూ అమ్మమ్మ గొంతు వినబడడంతో కొంచెం గుండె దిటవు చేసుకుని చుట్టూ చూశాడు. ఎదురుగా సోఫాలో ఆస్ట్రోనాట్స్‌లా పై నుంచి క్రిందకి స్పేస్ సూట్లు ధరించిన అయిదారుగురు మనుషుల్ని చూసి 'అమ్మో! పొరపాటున ఏ తీవ్రవాదుల డెన్‌లోనో పడినట్లున్నాను' అని మళ్లీ కెవ్వున అరిచేలోగా ప్రమాదం గ్రహించిన పెదమామయ్య ముఖం మీద గుడ్డ తీసి ''మేము ఏ తీవ్రవాదులం కాదు- మేము మేమేరా- నువ్వు ఊరికే కంగారుపడి కెవ్వు కెవ్వు మని అరవకు'' అన్నాడు.


తరవాత ఒకరి వెనుక ఒకరు మొహం మాత్రం చూపించి పరిచయం చేసుకున్నారు- అమ్మమ్మనీ తాతయ్యనీ ఇంతవరకూ నెట్ ఛాటింగ్‌లో తప్ప ఎదురుగా చూడకపోవడంతో వాళ్ల కాళ్లకి నమస్కరించాడు గౌరవంగా.

ఇంతలో మొహం మీద చురకత్తితో దాడిచేసినట్లు చుర్రుమంది- ఏదో సెనగ గింజంత కీటకం మొహం మీద వాలడంతో అంతకు ముందెప్పుడూ దాన్ని చూడకపోవడంతో గట్టిగా భయంతో ''మామయ్యా'' అంటూ కేకేసాడు..చంద్ర.

అది ఎగిరిపోయింది. కానీ మొహమంతా ఒకటే మంట. కళ్లలో నీళ్లు తిరుగుతున్న చంద్రని చూసి అమ్మమ్మ బాధపడి ''వీడికి ఎం.ఆర్.ఎస్. తెమ్మన్నాను కదా తెచ్చావా పెద్దబాబూ'' అని అడిగింది. వెంటనే రియాక్టయిన పెద్దమామయ్య వార్డ్‌రోబ్‌లో నుంచి వాళ్లు వేసుకున్న సూట్‌లాంటిదే ఒకటి తీసిచ్చాడు.

''ఏమిటివన్నీ-నాకు ఇలా అమ్మ ఏమీ చెప్పలేదే'' అంటూ క్వశ్చన్‌మార్క్ ఫేస్ పెట్టాడు.

'భోజనం చేస్తూ మాట్లాడు



కుందాం' అని చెప్పి రింగ్‌టైప్‌లో ఉన్న మెట్లెక్కి పైనున్న డైనింగ్ రూంలోనికి నడిచారందరూ. ఒక ప్రక్కగా కుక్కర్‌లో బోయిల్ అవుతున్న గ్లవుస్ తీసిచ్చింది అమ్మమ్మ- స్టైరిలైజ్ చేసిన ఉడెన్ ప్లేట్, గ్లాస్, టేబుల్ మీద పెట్టి ఒవెన్ కం వార్మర్‌లో నుంచి రుమాలీ రోటీ, దాల్ సబ్జీ, మసాలా ఫ్రై, ఖీర్ తీసి సర్వ్ చేసింది.

''వేడి వేడిగా ఉండగానే తినెయ్యి'' ఆప్యాయంగా హెచ్చరించాడు తాతయ్య.

చాలా రుచిగా ఉన్న ఆర్గానిక్ కూరగాయల రుచిని ఆస్వాదిస్తూ మాట్లాడకుండా భోం చేసాడు చంద్ర.

లివింగ్ రూంలో తాతగారి ప్రక్కనే కూర్చుని అప్పుడు మళ్లీ తన డౌట్స్ ఎక్స్‌ప్రెస్ చేశాడు. ''అమ్మ ఇక్కడ జనం చాలా ఎక్కువగా ఉంటారని, పగలు రాత్రి తేడా లేదని, సెకండ్ షిఫ్ట్ కూడా జరుగుతుందని మీరంతా నాకోసం స్పేసోడ్రోంకి వస్తారని ఏవేవో చెప్పింది కానీ ఇక్కడ అస్సలేం కన్పించడం లేదు'' అంటూ.

దీర్ఘంగా నిట్టూర్చాడు తాతయ్య- ''మీ అమ్మకి ఈమధ్య కాలంలో జరిగిన సంగతులేం సరిగా తెలియవురా- జనాభా పెరిగినందుకు తీసుకున్న చర్యలని ప్రభుత్వం స్ట్రిక్ట్‌గా ఆచరణలో పెట్టేసరికి మరో పెద్ద ఉపద్రవం వచ్చిపడింది. అదీ ఇప్పుడు నిన్ను కుట్టిన దోమ రూపంలో- గత 50 సంవత్సరాలుగా దోమల నివారణకి రకరకాల పనులు చేస్తూనే ఉన్నాం- ఈ సంవత్సరం వానాకాలంలో దోమల ఉత్పత్తి తీవ్రంగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని దోమల విస్ఫోటన సంవత్సరంగా ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న స్ప్రేలు, మందులు, కోయిల్స్, లిక్విడ్స్ దేనికీ దోమలు లొంగకపోవడంతో శాస్త్రవేత్తలు ఆ మందులకి దోమలు అలవాటు పడిపోయాయనీ, ఇంకొక క్రొత్తమందు కనుగొనవలసిన అవసరం ఉందనీ తేల్చి చెప్పారు. దానితో ఇక వ్యక్తిగతంగా ఎవరికి వారే రక్షించుకోవలసిన పరిస్థితి వచ్చింది. చీకటి పడేసరికి గుంపులు గుంపులుగా దాడిచేసి రక్తం పీలుస్తున్న దోమల నుంచి రక్షించుకోవడానికి ప్రభుత్వం మందు కనుగొనే వరకూ నైట్ షిఫ్ట్ రద్దు చేసింది. మస్కిటో ప్రూఫ్ గ్లాసెలతో ఇళ్లకీ, ఆఫీసులకీ తలుపులు పెట్టించాము. అందుకే నిన్ను డ్రైవర్ టాక్సీ డోర్ తియ్యద్దు అన్నాడు. రాత్రి పూట దోమల నుంచి తప్పించుకునేందుకు ఈ మస్కిటో రెసిస్టెంట్ సూట్ (ఎం.ఆర్.ఎస్)ని 'పాటా' సంస్థ వారు డిజైన్ చేసారు. దళసరిగా మిలిటరీ యూనిఫారంలా ఉన్న ఈ క్లాత్‌లో దోమల తొండాలు గుచ్చుకోవు. ఎవరితోనూ మాట్లాడే పని లేకపోతే టోపీలో నుంచి లాగి మొహానికి కూడా నెట్ వేసేసుకుంటాము. ఆహారం మీద వాలకుండా స్టెరిలైజ్డ్ ప్లేట్స్, వార్మర్‌లోని ఫుడ్ మాత్రమే వాడుతున్నాం. గేదెలు, ఆవులని దోమలు కుట్టి పాల ద్వారా జబ్బులు రావడంతో ఆవు పాలు, పెరుగు, నెయ్యి నిషేధించాము. వెజిటబుల్ ఫాట్స్ ఒక్కటే తింటున్నాము. సినిమాకి, అవుటింగ్ వెళ్లాలన్నా ఈ సూట్ తప్పనిసరి. లేకపోతే మన పని యుద్ధంలో క్షతగాత్రుల్లా అయిపోతుంది. పార్కులూ, సినిమాలూ అన్నీ బంద్. అందుకే ఆరయితే రోడ్లన్నీ నిర్మానుష్యం- దోమలు కుట్టి గన్యాలూ, డెంగ్యూలు వచ్చి కొంతమంది, దోమ కుట్టిందన్న భయంతో బెంగపడి చాలామంది చచ్చిపోయారు. అధికారపక్షం ఈ దిశగా ప్రయత్నించి జనాభా సమస్యని తగ్గించడానికి ప్రయత్నిస్తోందని విపక్షాలు గత వారంగా ధర్నాలూ, బందీలూ నిర్వహిస్తోంది. ఇవన్నీ మీ అమ్మకి చెప్పి మనసు పాడు చెయ్యడం ఎందుకని నేనే చెప్పలేదురా'' తాతయ్య చిన్న విరామం ఇచ్చాడు.

''అయితే మా చంద్రగ్రహమే మేలు'' అన్నాడు అప్రయత్నంగా చంద్ర. ''మేమక్కడ డ్రెయినేజ్ వాటర్‌ని రీసైక్లింగ్ చేసి కూరగాయల పెంపకానికి, వేస్ట్‌ని రీసైకిల్ చేసి ఎరువులుగా ఉపయోగిస్తాం- ఈ రీసైక్లింగ్ ప్లాంట్‌ని పార్కు కంటే ముందు ప్రతీ కాలనీలోనూ నిర్మిస్తాం- ఉద్యోగస్థులంతా దినసరి వేతనాలకి పనిచేస్తారు. ఉద్యోగభద్రత లేదు కనుక స్ట్రయిక్‌లూ, సమ్మెలూ ఉండవు. ఏరోజు సరిగా పని చెయ్యకపోతే ఆరోజే ఇంటికి- అడిగేందుకు యూనియన్లూ, సిండికేట్లూ లేవు. అయినా అంతా హేపీ- ఎవరి పని వాళ్లు సరిగా చేస్తే ఎన్ని ప్రమాదాలని ఆపగలమో ఇప్పటికీ మీరు నేర్చుకోలేదు'' తాతయ్య ఫీలవుతాడేమో అని నెమ్మదిగా అన్నాడు చంద్ర.

కానీ తాతయ్య బోసినోటితో ఆప్యాయంగా నవ్వాడు మస్కిటోనెట్‌లో నుంచి- ''ప్రజలలో వ్యక్తిగత క్రమశిక్షణ అంటూ ఉన్నరోజు జనాభా అయినా పరిశుభ్రత, పర్యావరణం ఏదైనా పెద్ద సమస్య కాదు. ప్రతివాడూ ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూస్తూ కూచుంటే చివరికి మోసపోయేది రాబోయే తరాలలోని ప్రజలే'' అన్నాడు ముక్తాయింపుగా- వచ్చిన పని మర్చిపోయి 'సేవ్ మై మదర్ లాండ్ ఫ్రం ఆల్ దీజ్ ఈవిల్స్' అని ప్రార్థిస్తూ ఉండిపోయాడు చందు.

☆

## నయనతార సంబరం

**నయనతారకి తెలుగులో తనకంటూ ఇంతదాకా చెప్పుకోదగ్గ హిట్ లేదనే చెప్పాలి. వెంకటేష్ నటించిన 'లక్ష్మి' సినిమా హిట్టయినా కూడా అది ఆమెకి పేరు తేలేదు. ఆ తర్వాత బాస్, యోగి సినిమాలు ఫట్‌మన్నాయి. తాజాగా 'దుబాయ్ శీను' హిట్ కావడంతో నయనతారకి తెలుగులో కొత్త ఉత్సాహం అందించినట్టయింది. శింబుతో గొడవ పుణ్యమాని తమిళ సినిమాల పట్ల అంతగా ఆసక్తి లేని నయనతారకి తెలుగులో నటించడం వల్ల పేరుతోపాటు పారితోషికం కూడా ఎక్కువగానే గిట్టుబాటు అవుతుంది. అందుకనే తెలుగు రంగంపైనే ఎక్కువ ఆసక్తి వుండడం సహజం. సో, 'దుబాయ్ శీను' నయనతారకి మంచి మేలే చేసాడన్నమాట.**

